వ్యాస కౌముది



# దివికేగిన జూకామల్లి- డాక్టర్ కేబీ లక్ష్మి

- వారణాసి నాగలక్ష్మి

***ఆమెతో నా పరిచయానికి పదిహేనేళ్లు.***



వయసులోనూ, సాహితీ రంగంలోనూ సీనియర్ కావడం వల్ల ఆమెని బహువచనంలో సంబోధించేదాన్ని. క్రమేపీ ఆమెకి నా పట్ల వాత్సల్యం, నాకు ఆమె పట్ల అభిమానం ఏర్పడ్డాయి. కొన్నాళ్ల తర్వాత 'మీరు' అనవద్దని కోప్పడి, అలిగి, నువ్వు అని పిలిపించుకుంది. అప్పటికే రచయిత్రుల్లో నాతో సహా చాలా మందికి లక్ష్మి పేరుండడం వల్ల తనని 'కేబీ'అని పిలిచేదాన్ని. ఈ వ్యాసంలో కూడా అలా రాయడమే సహజంగా అనిపిస్తోంది. ఇందులో ఆమె ఒక వ్యక్తిగా ఎలాంటి స్ఫూర్తిమంతమైన జీవితం గడిపిందో రాయాలనుకున్నాను. ఆమె రచనా వైదుష్యాన్ని గాని, పాత్రికేయురాలిగా ఆమె ఘనత గురించి గాని, వక్తగా ఆమె ప్రజ్ఞ గురించి గాని ఈ వ్యాసంలో ప్రస్తావించదలచలేదు.

2003 సంవత్సరం చివర్లో నా మొదటి పుస్తకం 'వానచినుకులు' కాపీలు ఇంటికి వచ్చాయి. ఆ పుస్తకపు ఆవిష్కరణ సభలో పుస్తకం గురించి ప్రసంగించేందుకు వేదికమీద 'మీతో పాటు మహిళా ప్రముఖులొకరుంటే బావుంటుం'దని రామాచారిగారు సూచించడంతో 'ఈనాడు' కార్యాలయానికి వెళ్లాను, కేబీ లక్ష్మిగారిని అడుగుదామని. తన పేరు కూడా ఆయనే సూచించారు. అప్పటికి నాకు సాహిత్య వాతావరణంతో పరిచయమే లేదు, ఏదో ఇష్టమైన పుస్తకాలు చదువుకోవడం, అడపాదడపా ఓ కథో కవితో రాసుకోవడం తప్ప.

ఆవిడేమిటి, ఎక్కడుంటారు ఈ వివరాలు కనుక్కుని ఈనాడు ఆఫీసుకి బెరుకు బెరుగ్గా వెళ్లడం నిన్నో మొన్నో జరిగినంత తాజాగా గుర్తుండిపోయింది. వెతుక్కుంటూ వెళ్ళిన నాకు తన కాబిన్ లో తీరైన ఆకృతిలో, పొడుగాటి జడతో, మెరిసే పలువరసతో చలాకీగా ఉన్న కేబీ కనిపించారు. నేను మొహమాటంగా పలకరించి పరిచయం చేసుకోబోయాను. చకచకా ప్రశ్నలేస్తూ కావలసిన సమాచారమంతా నాచేత చెప్పించేశారు. మొదటి పుస్తకమా అనడిగి తన సొంత చెల్లెలికి చెప్పినట్టు ఏవో సలహాలిచ్చారు. 'ఆహ్వానపత్రిక వచ్చాక తీసుకొచ్చి ఇస్తా'నంటే "ఎందుకూ దండగ? పోస్టులో పంపెయ్" అన్నారు. ముఖ్య అతిధిగా నారాయణరెడ్డిగారు వస్తున్నారని తెలిసి 'మా గురువుగారేలే' అని, "ఏం ఫికరు పడక! టైం కి వచ్చేస్తాలే" అనడం ఇంకా గుర్తుంది.

వెనక్కి వచ్చేస్తుంటే ఆ సూటిదనం, అనవసరమైనవాటిని కత్తిరించి పారేసి, అతి తక్కువ వ్యవధిలో సారాన్ని మాత్రం ఏరుకోగల నైపుణ్యం (చతుర విపుల పత్రికలు రెంటికీ దశాబ్దాలుగా సంపాదకత్వం నెరిపిన అనుభవం), తళుక్కుమంటూ ఎల్లల్ని చెరిపిపారేయగల ఆమె నవ్వూ...నా మనసంతా నిండిపోయాయి. ఆ నిర్మొహమాటం, కొత్తగా పరిచయమైనా నువ్వు అంటూ చనువుగా సంబోధించడం, అణువణువునా తొణికిసలాడుతున్న ఆత్మవిశ్వాసం నన్ను ఆకట్టుకున్నాయి.

ఆ తర్వాతి నెలలో అంటే 2004 జనవరిలో, చిరుజల్లుల మధ్య త్యాగరాయ గాన సభలో 'వానచినుకులు' పుస్తకావిష్కరణా, ఆ పుస్తకం లోని పాటలతో లలితగీత విభావరీ అద్భుతంగా జరిగాయి. కేబీతో నా పరిచయం స్నేహమైపోయింది. మళ్లీ 2015 లో నా అయిదవ పుస్తకం 'వేకువపాట' కథా సంకలనాన్ని ఆవిష్కరిస్తుంటే మరోసారి నాతో వేదిక పంచుకుని ఆ సభకి తను అధ్యక్షత వహించింది.

అప్పట్లో మేముంటున్న ఇంటికీ, వాళ్లింటికీ ఓ కిలోమీటరు దూరం. ఎన్నోసార్లు నగరంలోనూ, కొన్ని సాహితీ యాత్రల్లోనూ కలిసి ప్రయాణించాం. ఎక్కడికి వెళ్లినా దారిలో ఎదురైన ప్రతి మనిషినీ పలకరించి వారి జీవితం గురించి తెలుసుకోవడం, ఒక మంచి మాటతో సంతోషాన్నీ, పనికొచ్చే ఒక సూచనతో స్ఫూర్తినీ అందించడం ఆమెకి అలవాటు. తోటలోనైనా అడవిలోనైనా ప్రతి పువ్వూ తనని ఆకర్షించేది. చటుక్కున ఓ పువ్వు కోసేసి ఒత్తైన తన జడలో పెట్టేసుకునేది. 'ఇలా నాకో ఫొటో తియ్' అని డిమాండ్ చేసేది. సాహిత్యకారులందరితోనూ ఎల్లల్లేని ఆత్మీయబంధం తనకి. రంగురంగుల మట్టి గాజులూ, పూసల గొలుసులూ, సన్నని పూల గాలీ, కమ్మని కాఫీ, తీయని పాటా, చక్కని కథా, చిక్కని కవితా...తన ఇష్టాలు. వీటన్నిటితో జీవితాన్ని సౌందర్యభరితం చేసుకోవడం, నైరాశ్యాన్ని దరిదాపులకి రాకుండా తరిమేయడం ఆమెకి తెలిసినట్టుగా ఎవరికీ తెలియదేమో. ఇంతటి సౌకుమార్యం కింద ఒక ధీరవనిత దాగి ఉంటుందని అప్పట్లో నేను ఊహించలేదు. తర్వాత్తర్వాత ఆమె జీవితపు ఆటుపోట్ల గురించీ, వాటిమీద తన బతుకు నావను నేర్పుగా ఆమె నడుపుకున్న తీరు గురించీ తెలిశాక ఆమె పట్లమరింతగా అభిమానం కలిగింది.

'శీతవేళ రానీయకు, శిశిరానికి చోటీయకు
ఎద లోపలి పూలకారు ఏనాటికి పోనీయకు'

అన్న కృష్ణశాస్త్రి గారి పలుకుల్ని ఆమె తన జీవన సూత్రంగా ఎన్నుకుందేమో అనిపిస్తుంది. అమె ఎదలోని పూలకారు నిరంతరం కుసుమిస్తూనే ఉంది ఆఖరి క్షణం వరకూ.

కేబీ మాటల మందిరం మధ్యలోకి కామేశ్ గారు వస్తూ పోతూ ఉంటారు. పరిచయమైన కొత్తల్లో ఆ మాటలు విన్నపుడు ఆయన గతించారన్న విషయం నాకు అర్థమే కాలేదు. ఆమె మాటల్లో ఆయనెపుడూ సజీవులే. సెలవురోజు వచ్చేసరికల్లా బజార్లో ఉన్న అన్నిరకాల వార్తాపత్రికలూ, వార పత్రికలూ ఎలా కొని పట్టుకొచ్చేవారో, ఏటా నుమాయిష్ కి ఇద్దరూ కలిసి ఎలా వెళ్లేవారో, స్నేహితులతో ఆదివారాలు ఎలా గడిచేవో, తలలో పూలు లేకుండా కనపడితే వెంటనే వెళ్లి పూలెలా పట్టుకొచ్చేవారో, స్కూటర్ మీద పోతూ భుజం మీద తన చేతిని తాకి ఆ గాజుల సవ్వడిని ఎలా ఆస్వాదించేవారో, మట్టిగాజులు లేకుండా కేవలం బంగారు గాజులు మాత్రమే తగిలితే 'ఛీ' అని ఆ చేతిని ఎలా వదిలేసే వారో ... మురిసిపోతూ చెప్తుంటే ఆ వ్యక్తి తన గుండెలో ఎంత సజీవంగా, పదిలంగా ఉన్నారో స్పష్టమైపోతూండేది.


భర్త కామేశ్ గారితో

ఈ కబుర్లన్నీ తనకే సొంతమైన నవ్వుతో మిళితం చేసి చెప్పేది కేబీ. ఆ చెప్పడంలో ఎక్కడా చిన్నపాటి విషాదం కూడా వినబడనిచ్చేది కాదు. ఆ విషాదం తనకత్యంత ప్రియతముడైన ఆ వ్యక్తికి తాకుతుందేమో అన్నంత జాగ్రత్తగా దాన్ని తొక్కిపట్టేసి, హాయిగా నవ్వుతూ ఆ నవ్వుల్లో మల్లెలు పూయించేది. ఆ పూల సౌరభాల మధ్యే కామేశ్ గారి నివాసం.



భర్త, పిల్లలతో

భార్గవీ రఘురాం, రఘురామ్ గోడా గార్లతో కేబీ, కామేశ్ గార్ల స్నేహం వారి యువవాణి రోజుల నాటిది. ఒకసారి భార్గవి చెప్పారు నేనెపుడూ చూడని కామేశ్ గారి గురించి. 'స్నేహమేరా జీవితం' తరహా కామేశ్ గారిది. ఎంత రాత్రైనా సరే, ఏ దారిన వెడుతుంటే ఆ దారిలో ఉన్న స్నేహితుల ఇళ్లకి వెళ్లి తలుపు తట్టి పలకరించకుండా ముందుకెళ్లేవారుకాదుట. 'మరీ రాత్రయింది... పడుకున్నారేమో, ఆదివారం కదా విశ్రాంతి తీసుకుంటున్నారేమో' అంటే వినేవారు కాదుట. 'పడుకుంటే ఏమయింది? లేస్తారు.... రోజూ ఉండే నిద్రే కదా!' అనేసి వాళ్ల ని పలకరించి, క్షేమం కనుక్కుని వెళ్లిపోయేవారుట.

పెళ్లై, పిల్లలు పుట్టి, వాళ్లు పెద్దవాళ్లయ్యాక ఆమె డాక్టర్ గోపీ గారి మార్గదర్శకత్వంలో, ఐ వి ఎస్ అచ్యుత వల్లి గారి నవలల మీద పరిశోధన చేసి, 2002 లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి పీ హెచ్డీ పట్టా పొందింది. డాక్టర్ కేబీ లక్ష్మి అనిపించుకోవాలన్న తన చిరకాల వాంఛ నెరవేరింది. ఆ తర్వాత కొన్నాళ్లకే కేబీ కి మొదటిసారిగా ఒక ప్రముఖ పురస్కారమైన నంది అవార్డు వచ్చింది. దంపతులిద్దరికీ ఆనంద సమయం! రోజూలా స్కూటర్ మీద కాకుండా కార్లో వెళ్లాలని, ఎవరో స్నేహితుడి దగ్గర కారు అడిగి తీసుకున్నారుట కామేశ్ గారు. ఆనందోల్లాసాలతో వెళ్లి కార్యక్రమం పూర్తయ్యాక ఇంటికొచ్చి సభ తాలూకు కబుర్లతో భోజనం కానిచ్చిన కొద్దిసేపటికే తీవ్రమైన గుండెనొప్పితో కామేశ్ గారు కేబీ ఒడిలోకి ఒరిగిపోయారట! ఎంత విషాదం!

తెల్లవారితే ఉగాది. ఆమె కంటివెంట ఒక్క నీటిచుక్క కూడా రాలేదుట. అంతరాంతరాల్లో ఏర్పడిన అతి లోతైన గాయం పైకి కనపడలేదు. భర్త హఠాన్మరణం తర్వాత ఏడాది పాటు ఆమె ఏ రోజూ రెండు గంటలు కూడా నిద్ర పోలేకపోయింది. తెల్లవారు జామున ఏ కాసేపో చిన్న కునుకు. మళ్లీ రోజువారీ పనులు. ఉద్యోగం. ఏకైక కుమారుడిని కోల్పోయిన అత్తగారి బాధ్యత. ఇంకా పూర్తిగా రెక్కలు రాని పిల్లలు. ఆదుకుందుకు వెనక ఆస్తిపాస్తులేవీ లేవు. ఆమె రెక్కలే ఆ కుటుంబానికి ఆధారం!

అయినా ఆమె నవ్వుని వాడనీయలేదు. ఎదలోపలి పూలకారుని పోనీయలేదు. ఒక్కరోజు కూడా తన జడలో పూలదండ లేకపోతే ఒప్పుకోని ప్రియ సఖుడు నివసించే చోటు కదా అది. ఆ చోటుని పూల పరిమళాలు లేకుండా ఆమె ఎలా ఉంచుతుంది?

కామేశ్ గారి మరణం తర్వాత అయిదోరోజు కాబోలు ఆయన సంస్మరణ సభ జరిగింది. భార్గవి గారు, రఘురామ్ గారు కూడా ఆ సభకి వెళ్ళారు. ఎవరూ ఊహించి ఉండరు కేబీ కూడా ఆ సభకి వస్తుందని. చాలా మామూలుగా ఉండి, సభలో తనూ మాట్లాడిందిట. కామేశ్ గారు తమ ఇంటికి వచ్చి, ఇంటి ప్రహరీగోడ దగ్గర నిలబడి 'పెళ్లి చేసుకుందా'మని ప్రపోజ్ చేయడం, తను ఒప్పుకోవడం, వెంటనే ఆయన తన జేబులో ఉన్న చిన్న కుంకుమ పాకెట్ తీసి ఆమె పాపిట్లో సింధూరం పెట్టి, 'ఇదే మన నిశ్చితార్థం' అనడం, ఆ నిశ్చితార్థం తర్వాత నిరాడంబరంగా పెళ్లి చేసుకుని, రమణాశ్రమం వెళ్లి చలం గారి ఆశీస్సులు తీసుకోవడం ....అంతా చెప్పి 'కామేశ్ నా పాపిట్లో పెట్టిన

సింధూరాన్ని నేనిక ధరించను. కానీ అతను నన్నెపుడూ కుంకుమలేకుండా, తలలో పూలు లేకుండా చూడడానికి ఇష్టపడేవాడు కాదు. అందుకే ఇక ముందు కూడా, అతను నన్నెలా చూడాలనుకున్నాడో అలాగే ఉంటాను' అని చెప్పిందని భార్గవి గారు నాకు చెప్పారు. ఇది విన్న నాకు శరీరంలో ఒక గగుర్పాటు కలిగింది. అకస్మాత్తుగా అంతటి షాక్ తగిలిన వారంలోపే ఒక భారీ సభలో అలా చెప్పగలిగిన ఆమె పట్ల నాకు ఎంత గౌరవం కలిగిందో చెప్పలేను. అభ్యుదయమంటే దుస్తుల్లోనో, మాటల్లోనో, భాషలోనో కనబడేది కాదు. ఆలోచనల్లో, ప్రవర్తనలో చూపాల్సిందని కేబీ చెప్పకుండానే తెలియజెప్పింది.

వాకపల్లి సామాజిక యాత్రలో మేం భూమిక టీమ్ తో కలిసి ప్రయాణించాం. అపుడు కేబీ చెప్పింది తనకి నిద్ర ఎందుకు పట్టదో. ఆమె ఎపుడూ కామేశ్ గారి భుజం మీద తలపెట్టుకుని నిద్రపోయేదట. పెళ్లయాక ఎప్పుడూ దిండు వాడలేదుట. ఆ భుజం ఇక దొరకదు. మరి నిద్రెలా పడుతుంది?

ఒక ఉద్యోగిగా ఆమె నిరంతర అధ్యయన శీలి. కాలమ్స్ రాసినా, ప్రముఖులని ఇంటర్వ్యూ చేసినా, కథో కవితో రచించినా, మహామహులు కూర్చున్న వేదికపైన ప్రసంగించినా ఆమె శైలి సరళ సుందరం, వాక్కు మధుర మంజులం, తీరు ఉత్కంఠ భరితం. 'ఈనాడు'లో ఆమెతో కలసి పనిచేసినవారందరికీ కేబీ లక్ష్మి ఒక ఆశ్చర్యం. ఒక సంభ్రమం. చిరునవ్వులేని ఆమె వదనాన్ని ఎవరూ చూడలేదు. భ్రుకుటి ముడిపడేలోగానే ఆమె పెదవి విచ్చుకునేది. సంభాషణలో సున్నితమైన మువ్వల శబ్దంలా ఉండుండి రవళించే ఆ నవ్వు ఆమెకే ప్రత్యేకం.

ఎవరికైనా సరే జీవితమనేది ఒక వరం. సమస్యలు పెద్దవైనా, చిన్నవైనా మనిషి ధైర్యంగా ఎదుర్కోవాలే గాని పారిపోయే ప్రయత్నం చెయ్యకూడదు. ఎన్ని కష్టాలున్న మనిషైనా దారి పక్కన పూసిన ఒక గడ్డిపూవులోనో, ఉదయ సంధ్యలో మెరిసే మంచుబిందువులోనో, పిల్లతెమ్మెరలో తేలివచ్చే పూల సువాసనలోనో వెల్లివిరిసే కాస్తంత ఆహ్లాదాన్ని అందుకోవాలనుకుంటే ఏదీ ఆపలేదు. కేబీ ఎవరికీ ఇలా నీతిబోధలు చేయలేదు. తన జీవితమే తన సందేశం అన్నట్టు తన ప్రవర్తనతోనే ఆమె చూపించింది.

ఒకసారి పొద్దున్నే ఎలా ఉన్నారని ఫోన్లో పలకరిస్తే, గలగలా నవ్వుతూ ముందురోజు జరిగిన సంఘటన చెప్పుకొచ్చింది "నిన్నరాత్రి సాహితీ సమావేశమయ్యాక అమీర్ పేటలో దిగి ఇంటివైపు నడుస్తుంటే ఎవడో కుర్రాడు స్కూటర్ మీద పోతూ ఢీ కొట్టాడోయ్. పడిపోయాను. పాపం వాడూ భయపడిపోయాడు. కాలేజీలో చదువుతున్నాట్ట. 'ఏం కాలేదులేరా బాబూ. నువ్వెళ్లు' అని పంపించేసి కాస్త నిలదొక్కుకుని ఇంటివైపు నడిచా. నాలుగడుగులేగా ఇంటికీ.... లోపలికొచ్చి ఏమిటా దిమ్ముగా ఉందని తల మీద చెయ్యి పెట్టుకుని చూస్తే చేతికి రక్తం. ఇంక పదిన్నరకి బయల్దేరి ఆసుపత్రికి వెళ్లి కుట్లు వేయించుకొచ్చా." ఇక ఫోనుకి ఇటువైపు మాటలు రాయడం అనవసరం.

ఆ యాక్సిడెంట్ తర్వాత దెబ్బతిన్న నరాల వల్ల తనకి వినికిడి సమస్య వచ్చింది. నా భర్త శర్మగారు ENT సర్జన్ కావడంతో ఆమె చెవిని పరీక్షించి చికిత్స అందించడం జరిగింది. ఆ తర్వాత కొంత మెరుగయింది గాని సమస్య పూర్తిగా నయం కాలేదు. అంతకు చాలా కాలం క్రితం కుటుంబంతో శ్రీనగర్ వెళ్లినపుడు ఫ్రాస్ట్ బైట్ వల్ల ఆమె కుడి చేతి వేళ్లు బాగా దెబ్బతిన్నాయి. అయినా రచయిత్రిగా, సంపాదకురాలిగా తన పనిలో (అప్పట్లో కంప్యూటర్ టైపింగ్ లేదు. చేత్తో వ్రాయవలసిందే ఏ రచన అయినా) ఏ రిమార్కూ లేకుండా పదిమందీ మెచ్చుకునేలా వృత్తి బాధ్యతలు నిర్వర్తించింది. తర్వాతి కాలంలో కూడా అనుకోని ఇబ్బందులు ఎన్నో ఎదురైనా, 'ఎందుకిలా జరిగిం'దని దిగులు చెందుతూ కాకుండా, 'జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడేం చెయ్యాలో అది చేద్దాం' అన్న ధోరణి ఆమెది. ఎవరిమీదా ఆధారపడకుండా జీవించడం తను అలవరచుకున్న జీవన విధానం.

కేబీకి అందరూ కావాలి. వర్షం పడుతుంటే స్నేహితులతో మిర్చీ బజ్జీ తినాలి. ఏ కాలమైనా, ఏ సమయమైనా తనకున్న మిత్ర సహస్రంలో తనపక్కనెవరుంటే వారితో కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగాలి. సాయంత్రం ఏ సమావేశం ఉన్నా, ఎంత కాలాతీతమవుతున్నా, ఆటోనో కారో... దేన్లో వెళ్తుంటే దాన్ని ఎంత రద్దీలోనైనా ఆపి, సహ ప్రయాణీకులు టైమ్ లేదని విసుక్కున్నా సరే, పువ్వులు కొనుక్కుని తలలో పెట్టుకుని గానీ ముందుకు కదిలేది కాదు.

కేబీ ఎప్పుడూ వర్తమానంలో జీవించింది. నిన్నటి గురించిన వేదననీ, రేపటి గురించిన బెంగనీ తన దరికి రానీయలేదు. ఈ అభిప్రాయాన్నే కిందటేడు మే నెలలో, మా స్నేహ వార్షికోత్సవ సందర్భంగా 'జీవన పోరాటాన్ని కెరటాల సయ్యాటగా, పరిచయాలని పరిమళాలుగా, ఒంటరితనాన్ని కవితాత్మక ఏకాంతంగా, సమూహపు ఉక్కిరిబిక్కిరిని ఉత్సవ సంరంభంగా మార్చుకోగల నైపుణ్యం కొద్దిమందికే సాధ్యం' అంటూ అలాంటి ఒక వ్యక్తిత్వంతో నాకు దొరికిన మైత్రీ బంధాన్ని గురించి ముఖ పుస్తక మిత్రులతో పంచుకున్నాను..

'మనిషిని కోల్పోవడం' అంటే ఏమిటో తనకి తెలుసు. అందుకే కలిసి ఉన్న కాలాన్ని ఎవ్వరూ నిర్లక్ష్యం చేయకూడదని ఎంతో తపన పడేది. ఏ జంటైనా ఒకరినొకరు పట్టించుకోకపోతే తనకెందుకని ఊరుకునేది కాదు. కాస్త పరిచయమున్నాసరే అదేమిటని నిలదీసేది.

తను ఊళ్లో ఉంటే చాలు ఏ సాహిత్యసభ అయినా సరే, ఆమె వేదిక మీదో, మొదటి వరసలోనో కనపడేది. తను సభలో కనపడలేదంటే ఊళ్లో లేదని అనుకునే వాళ్లం. అడగని వారిది లోపం అన్నట్టు, అడిగిన వెంటనే పుస్తకావిష్కర్త గానో, వక్త గానో రావడానికి ఒప్పుకునేది. ఎన్ని కాలమ్స్ రాసిందో, ఎంతమంది ప్రముఖులని ఇంటర్వ్యూలు చేసిందో లెక్కలేదు. ఎక్కడికైనా ఏ వేళైనా ఒకర్తే వెళ్లిపోయే ధీరత తనది. అలాగని తనకి విలువ లేని చోట క్షణమైనా నిలబడేది కాదు. స్త్రీలైనా పురుషులైనా ధనికులైనా పేదలైనా తన దృష్టికి మనుషులు అంతే. అందుకే నోరారా పలకరించి, మనసారా మాట్లాడగలిగేది. ఎవరికైనా వక్ర దృష్టి ఉంటే అది వారి దృష్టిలోపం. తనదెపుడూ నిర్మలమైన దృష్టి, ముక్కుసూటి నడక.

ఇద్దరు పిల్లలు. ప్రవీణ్, సమీర. ప్రవీణ్ ప్రేమించిన పంజాబీ అమ్మాయి శివానితో అతని పెళ్లి సంతోషంగా జరిపించింది. కోడలికి హితురాలై, స్నేహితురాలై ఆమె మనసు గెలుచుకుంది. సమీర పెళ్లికి పదేళ్ల మా అమ్మాయిని తోడపెళ్లికూతురిగా పిలిచి, 'పాపాయికిష్టమైన బట్టలు కొని పట్టుకురా. ఆ బిల్లు నాకివ్వు' అని చెప్పింది. పెళ్ళి వైభవంగా జరిపించింది, అమ్మా నాన్నా తానే అయి. ఆ పెళ్ళికి ఎంతమంది ప్రముఖులు హాజరయ్యారో. పెళ్లి పందిరి కిటకిటలాడిపోయింది!



కూతురు సమీర పెళ్ళిలో

మేము శ్రీనగర్ కాలనీలో ఉండగా ఎన్నోసార్లు తను మా ఇంటికి వచ్చింది, నేనూ తనింటికి వెళ్లాను. మా బాల్కనీలో మొక్కల మధ్య కూర్చుని 'ఇక్కడకూచుంటే చేతిలో కాఫీ ఉండాలి' అని డిక్లేర్ చేసి, కమ్మని కాఫీ ఇస్తే, అంతకన్నా కమ్మని కబుర్లు చెప్పి వెళ్లేది. అప్పట్లో మొక్కలకున్న పండుటాకులు తుంచి తీసేయడం నాకు ఇష్టం ఉండేది కాదు. ఒకసారి గుబురుగా ఎదిగిన

మనీ ప్లాంట్ కున్న రెండో మూడో పండుటాకులు చూసి,'ఏమిటిదీ? ఈ పండూ ఎండూ ఇలా వదిలేస్తే ఎలా? చక్కగా సంరక్షణ చెయ్యవా?' అని చివాట్లు పెట్టింది.

కిందటేడు అనుకోకుండా ఒకరోజు మరో ముగ్గురు సాహితీమిత్రులతో కలిసి మా అమ్మతో గడపడానికి వస్తున్నానని చెప్పి మా ఇంటికి వచ్చింది. రోజంతా కలిసి గడిపాం. కబుర్లు చెప్పుకుంటూ కాఫీలు తాగాం, భోజనాలు చేశాం. అవాళ తను అమ్మ దగ్గర కూర్చుని, ఆవిడ చెయ్యి పట్టుకుని చిన్నపిల్లలా సంతోష పడింది.

'రాసిన వ్యాసాలూ, చేసిన ఇంటర్వ్యూలూ చాలు. మధ్యతరగతి మమకారాలతో, అనుబంధాలతో ఒక ప్రేమ నవల రాయ'మని పోరుతూ ఉండేదాన్ని. "రాయాలి.. రాస్తా...దంపతులు ప్రేమికులై, స్నేహితులై ఎలా జీవించాలో రాస్తా.. జీవన మాధుర్యాన్ని ఎలా పొందాలో అర్థమయ్యేలా ఒక రొమాంటిక్ నవల రాస్తా" అనేది. ఒకసారి అడిగినపుడు చెప్పింది, "మొదలుపెట్టానోయ్... కొంచెం రాశాను" అని. ఇపుడింక మనకది అందుకునే ప్రాప్తం లేదు.

2018 నవంబరు నెలలో సాహిత్యాభిలాషులు కొందరం దుబాయ్, అబుధాబీ వెళ్ళాం. ఆ అయిదురోజుల యాత్రకి కేబీ కూడా వచ్చింది. తెలుగు సాహితీప్రపంచంలో అంతా తన స్నేహితులే. పొద్దున్న ఉపాహారాల సమయంలో, రాత్రి భోజనాల సమయంలో అందరినీ బాల్య స్నేహితుల్లాగా పరిగణిస్తూ, పలకరిస్తూ డైనింగ్ హాలంతా కలియతిరిగేది. పగలంతా సైట్ సీయింగ్ కి వెళ్లేవాళ్లం. ఎక్కడికి వెళ్లినా అక్కడి వింతలూ విశేషాలన్నిటిపట్లా తనకెంతో కుతూహలం. ఎంత ప్రయాణం చేసినా తరగని ఉత్సాహం, వాడని చైతన్యం! నిర్లిప్తత, ఉదాశీనత లాంటి పదాలు తన నిఘంటువులో లేవేమో.

డెజర్ట్ సఫారీలో



డెజర్ట్ సఫారీకి ముందు ఇసుకతిన్నెల మధ్య నిలబడి, సూర్యుడు దిగంతరేఖవైపు పరుగులు తీస్తుంటే ఇద్దరం ఆ మనోహర ప్రకృతిని చూసిన గుర్తుగా కొన్ని ఫొటోలు తీసుకున్నాం. అసలు ఎక్కడున్నా ఆ చుట్టుపక్కల ఎవరుంటే వాళ్లని 'ఏయ్ నాన్నా ఇట్రా ..మా ఇద్దరికీ ఫొటో తియ్' అంటూ పిలిచి ఫోన్ అప్పగించేది. సంకోచం ఆమెకి పరిచయమున్న పదం కాదు. ఆటోలో వెళ్తూ ఆటో డ్రైవర్ జీవితమంతా తెలుసుకునేది. రైల్లో ప్రయాణిస్తుంటే బోగీలో అంతా తనకి పరిచయమైపోతారు. అరగంట మాట్లాడితే ఆ వ్యక్తి గురించి ఒక సుమారైన అంచనా ఆమె మనసులో తయారైపోతుంది.

దుబాయ్ ట్రిప్ తర్వాత కూడా సభల్లో కలుసుకుంటూనే ఉన్నాం. ఆగస్టు నెలలో తను కంచి వెళ్తున్నట్టు మిత్రులు చాలామందికి తెలియదు. రాగసప్తస్వరం బృందంలో చిరకాల మిత్రులతో కలిసి కంచి వెళ్లి,40 సంవత్సరాలకొకసారి దర్శనమిచ్చే వరదరాజస్వామిని చక్కగా దర్శించి, ట్రైన్ టైమైపోతోందంటున్నా వేడి కాఫీ తాగాలని మిత్రులని ఒప్పించి కాఫీ తాగి, స్టేషన్ చేరుకుని, రాత్రి టిఫిన్లకి అందరికీ ఇడ్లీ పాక్ చేయిస్తుంటే తనకు దోసె కావాలని అడిగి తెప్పించుకుని, ప్రయాణంలో టిఫిన్ తిన్న కాసేపటికి హార్ట్ ఎటాక్ తో కొద్దినిముషాల్లోనే మనని విడిచి వెళ్ళిపోయింది కేబీ.

'తలపెట్టినచోటికల్లా వెళ్లిపోయేది. అమ్మా, ఈ వయసులో ఇన్ని ప్రయాణాలు మంచివి కావు, నీ స్పీడు తగ్గించు అన్నా వినేది కాదు' అన్నాడు, ఆగస్టు 8న జరిగిన సంస్మరణ సభలో ప్రవీణ్. ఆ సభలో సమీర వర్ష మేఘమే. "అమ్మ పట్ల నా ఫిర్యాదు ఒక్కటే. నీకేం కావాలి అనడిగితే –అమ్మా నాకు డబ్బు వద్దు. బంగారం వద్దు. నాకొక ఉత్తరం రాయి అనడిగాను. ఈ నాలుగు రోజుల్లో ఇల్లంతా వెతికాను. చీరల

మధ్య ఎక్కడైనా ఒక ఉత్తరం కనిపిస్తుందేమో అని. ఎక్కడా కనిపించలేదు” అంటే అక్కడున్న సాహితీమిత్రులందరి కళ్లూ చెమర్చాయి. “అమ్మా నాన్నా మాకేదీ ‘ఇలా చెయ్యి, అలా చెయ్యి’ అని చెప్పలేదు. వాళ్లు ఎలా మెలిగేవారో చూసి అలా ఉండాలని మేం తెలుసుకున్నాం. చాలా మంది భార్యా భర్తలమధ్య బంధం ఎలా ఉంటుందంటే, భార్యలు భర్తలకి కావాలసినవన్నీ అమర్చుతారు. సేవలు చేసేస్తారు. కానీ ఇద్దరూ కలిసిమెలిసి గడపడం, ఇష్టాలూ సంతోషాలూ పంచుకోవడం ముఖ్యం అని వాళ్ళకి తోచదు. దూరదూరంగా మెలగుతారు. పిల్లలముందు ఒకరినొకరు తాకడం గానీ, ఒక హగ్ లేదా ఒక చిన్న ముద్దు గానీ ఉండదు. నేను ఎదుగుతూ ఉన్నపుడు నా స్నేహితుల ఇళ్లలో అలా ఉండేది. మా ఇంట్లో మాత్రం అలా కాదు. అమ్మా నాన్నా మధ్య ఉన్న స్నేహం, ఆత్మీయతా మాకు స్పష్టంగా తెలిసేది. భార్యా భర్తలు ఎలా ఉండాలో, తల్లిదండ్రులు ఎలా ఉండాలో వాళ్ళు వాళ్ల ప్రవర్తన ద్వారా మాకు చెప్పారు” అంది సమీర.

చావు పుట్టుకలు సహజం. కానీ ఇంతటి హఠాన్మరణం తర్వాత ఆమె భౌతిక కాయం ఇల్లు చేరేసరికి ఆ ఆవరణ అంతా ఆప్త మిత్రులతో, సాహితీ బంధువులతో క్రిక్కిరిసిపోయిందంటే దానికి కారణం తన వ్యక్తిత్వమే, జీవితకాలంలో తను సంపాదించుకున్న స్నేహాల సంపదే.

‘నిన్ను నిన్నుగా ప్రేమించుటకు, నీ కోసమే కన్నీరు నించుటకు’ అన్నట్టుగా ఆమెని తలచుకుని కన్నీరు నించిన వాళ్లెందరో. ఆ కన్నీటి మధ్యలోనే ప్రముఖ హాస్య రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి ‘ఎంత సునాయాస మరణం! నాకూ అలా లభిస్తే బావుండు’నన్నపుడు అంతా ‘నిజమే. బతికితే అలా స్వయంసిద్ధగా బతకాలి, అలా హంసలా క్షణాలలో మరణించాలి’ అన్నారు. మరికొందరు ‘కంచి వెళ్ళి వరదరాజస్వామిని దర్శించుకుంది. ఆయన పిలిచాడేమో వెళ్ళిపోయింది ‘అన్నారు. ‘పిల్లలు స్థిరపడ్డారు, ఇక కామేశ్ గారిని కలుసుకుందుకు వెళ్ళిం’దని ఇంకొందరన్నారు.

ఎవరు ఎపుడు ఎందుకు వస్తారో, ఎలా వెళ్తారో ఎవరికి తెలుసు? ఉన్నన్నాళ్లూ ఆటుపోట్లెన్ని వచ్చినా తన సంయమనం కోల్పోకుండా, ఎవరిమీదా ఆధారపడకుండా, తన బాధ్యతల్ని  సకాలంలో నెరవేర్చి, బహుముఖ ప్రతిభ గల పాత్రికేయురాలిగా, రచయిత్రిగా, కవయిత్రిగా, వక్తగా, విశిష్ట మహిళగా, ముప్పై సంవత్సరాలు ‘విపుల’, ‘చతుర’ వంటి ప్రతిష్టాత్మక పత్రికలకి సంపాదకురాలిగా పని చేసి, సాహిత్యంలో డాక్టరేట్ పట్టా సంపాదించుకుని, ఎన్నో పురస్కారాలు పొంది, జీవితం ఒక ఉత్సవం అన్నట్టు గడిపి, ముప్పై మంది మిత్రబృందం మధ్య, కేవలం కొద్ది నిముషాల ప్రయాసతో  ఆమె పరమ పదం చేరుకుంది.

కేబీ లక్ష్మి ఒక వ్యక్తి కాదు. ఒక స్ఫూర్తి. ఆమెకు నా నివాళి.

## *A Tribute to mother in law by Shivani*

**‘Dear Attayya’**

**-- Shivani Praveen, K.B.Lakshmi’s daughter in law**

God must be in good company, Attaya. He must be listening to your interesting anecdotes, marveling at your sense of humor, captivated by your mellifluous voice… you could mesmerize anyone, even Him.

My first glimpse of you reminded me of a flowing river – your beautiful pink silk sari, your long, flowing hair, your sparkling eyes, and the way you moved with pure grace. Your really were a river – a river of love, a river of knowledge, and a river of compassion.

Nothing could stop you from charting your own course. I have never met a person who had so many obstacles and hardships come her way – and yet like a river – you flowed through them all – from the toughest rocks to the mightiest dams – nothing could break your flow.

You smiled and conquered them all, and never managed to lose your childlike wonder and curiosity.

You lived life to the fullest – a free spirit with a sparkle of wanderlust that wanted to explore the whole world.

Thank you for giving me the greatest gift of my life – your son and my life partner. He is indeed a reflection of both his parents and the greatest human being I know.

As you have made your journey into the final ocean of eternity, we pray that you will continue to bless us and look out for us. It was an honor and privilege to be your Kodalu! May you rest in eternal peace and grace.

P.S. Thank you for saying my rasam was better than yours – you know, that's not true!★

## తెలుగు అనువాదం - వారణాసి నాగలక్ష్మి

దేవుడికి మంచి సాంగత్యం దొరికింది అత్తయ్యా! ఆయనిపుడు ఆసక్తికరమైన మీ పిట్టకథలూ, కబుర్లూ వింటూ మీ హాస్య చతురతకి అబ్బురపడుతూ, మధురమైన మీ కంఠస్వరానికి ఆకర్షితుడవుతూ ఉండి ఉంటాడు... మీరు ఎవరినైనా మంత్రముగ్ధులను చెయ్యగలరు, ఆ పరమాత్మని కూడా.

మొట్టమొదట మిమ్మల్ని చూసినపుడు, అందమైన మీ గులాబిరంగు చీరా, గాలికి ఎగిరే పొడవాటి జుట్టూ, మెరిసే కళ్లూ, హుందాగా నిండుగా మీరు నడయాడే విధానమూ ...అన్నీ కలిసి ఒక ప్రవహించే నదిలా మీరు నాకు కనిపించారు.

ఏదీ మీ ప్రవాహగతిని అడ్డుకోలేకపోయింది. మీకెదురైనన్ని అవరోధాలుగాని కష్టాలుగాని, వేరే ఎవరికీ ఎదురవగా నేను చూడలేదు. అయినా ఒక నదిలా మీరు వాటన్నిటి గుండా ప్రవహించి ముందుకే సాగారు. కఠినాతి కఠినమైన శిలలనుంచి, బ్రహ్మాండమైన ఆనకట్టలదాకా ఏదీ కూడా మీ ప్రవాహగతిని ఆపలేకపోయింది. మీరు నవ్వుతూనే ఆ అవరోధాలన్నిటినీ దాటారు!

మీరు జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించారు – సంకెళ్లకి లోబడని చేతనాస్వరూపమై ప్రపంచమంతటా సంచరించాలనే తృష్ణ మీది.

జీవితంలో నాకు లభించిన మహోన్నతమైన బహుమతి మీరిచ్చినదే – జీవన సహచరుడిగా నాకు మీ అబ్బాయినిచ్చారు, థాంక్యూ. మీ కోడలు కావడమే నాకొక గౌరవం, ఒక ప్రివిలేజ్!

ప్రయాణం పూర్తి చేసుకుని శాశ్వతమైన పరమ పదాన్ని, అనంత సాగరాన్ని మీరు చేరుకున్నవేళ మేం కోరేదొకటే. మమ్మల్ని ఎప్పటిలాగే దీవిస్తూ ఉండమనీ, కనిపెట్టి చూస్తూండమనీ.

అక్కడ మీకు ఆత్మశాంతీ, ఈశ్వరకృపా లభించి, మనసుకు నెమ్మది చేకూరుగాక.

P.S. చారు మీ కన్నా నేనే బాగా పెట్టానన్నందుకు థాంక్యూ– అది నిజం కాదని మీకు తెలుసు.

*From K B Lakshmi's children–*

'AMMA – The Ocean of Grace, Love & Talent'

Amma. The very sound of the word fills one with a sense of calm, peace, love, compassion and safety. She was always there in every sense. It is the 'go to' word for every child. Amma's ubiquitous presence was ever comforting.

Today, it has become synonymous with 'helplessness' topped with a deep sense of loss for us.

The play of destiny is unfathomable. And indisputable. In a flash, the most important person in my life just went away from our mortal reality. Amma will always live on forever though, through the Legacy that she unknowingly created through her feisty journey of life.



కొడుకు, కోడలు, మనవరాలితో

She was strong-willed, independent, supremely talented, enormously versatile, gracefully humble, poignant in demeanor, ever friendly and everything else that makes her one in a billion. Laughter and goodwill for others were her constant companions. Her love for literature was the call of her spirit. Her fearlessness and clarity of thought were the essence of her soul. Her smile reflected her outlook towards life and her mind kept it all together despite the extreme hardships she went through. She was relentless in her pursuit of excellence with an eye on perfection and beauty.

She was like a child with boundless energy – always curious, ever wanting to explore new places, assimilating myriad experiences, making fresh memories – refusing to slow down.

Most importantly, she was an inspiration. She could process things in a manner that was thought to be inconceivable. She was the epitome of courage under fire and grace under pressure.

Words cannot describe the fabulous way she lived her life and chartered her Legacy. A near perfect human being that the world will miss having around.

Her Legacy will live on through the collective memories of all those she touched and inadvertently influenced. There will not be another KB Lakshmi in eons to come.

Like the limitless ocean, may she rest in everlasting peace amidst the infinite eternity of the Universe. We will always keep looking out for you, Amma and shall keep seeking your love and counsel till the end of time. We are Blessed to be your children. **Say hi to Nanna!**

*Lots of love – Nee Praveen and Sameera.*

COMMENTS